# వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు ముఖ్యం సీఐ.లక్ష్మణరావు



**జి.మాడుగుల. పెన్ పవర్ జూన్(13)** వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ వెంట ఉంచుకోవాలని సీఐ లక్ష్మణరావు తెలిపారు. జి.మాడుగుల ప్రధాన కూడలిలో శనివారం ఎస్సై సాయిరాం పడాల్‌తో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చున్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, గంజాయి అక్రమ రవాణా, వినియోగానికి దూరంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం । అనకాపల్లి। అల్లూరి జిల్లా

# గిరిజన బిడ్డల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న గురుకులాలు



- విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం.. గిరిజన గురుకులాల ప్రత్యేకత
- ఐఐటీ-నీట్ లక్ష్యాలతో గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జూన్ 13:**గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, సమగ్ర వ్యక్తిత్వ వికాసం, అత్యున్నత పోటీ పరీక్షలకు శిక్షణ అందిస్తూ ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల విద్యాలయాల సంస్థ రాష్ట్రంలో ఆదర్శవంతమైన విద్యాసంస్థగా గుర్తింపు పొందుతోందని అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండల కేంద్రంలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ ఎం.వి. రమణ రావు పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 199 విద్యాసంస్థలను నిర్వహిస్తున్న ఈ సంస్థ వేలాది మంది గిరిజన విద్యార్థులకు విద్యా అవకాశాలు కల్పిస్తోంది. ప్రస్తుతం సంస్థ ఆధ్వర్యంలో 98 విద్యాసంస్థలు, బాలికల కోసం 73 విద్యాసంస్థలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న 28 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు కొనసాగుతున్నాయి. ఈ విద్యాసంస్థల్లో 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మొత్తం 53,127 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.విద్యతో పాటు విద్యార్థులకు ఐఐటీ, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందించడంతో పాటు ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంటర్మీడియట్ అనంతరం బాలికల కోసం ప్రత్యేక వృత్తి విద్య (వొకేషనల్) కోర్సులను కూడా ప్రవేశపెట్టారు. 2025-26 విద్యా సంవత్సరంలో సంస్థ విద్యార్థులు ఎస్ఎస్‌సీ ఫలితాల్లో 79.68 శాతం ఉత్తీర్ణత సాధించి 591 మంది 10/10 జీపీఏలు సాధించారు. 11 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత నమోదు చేయగా, ఇంటర్మీడియట్‌లో 93 శాతం, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 81 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఐఐటీ-జేఈఈ ఫలితాల్లో కూడా గిరిజన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 2025-26 విద్యా సంవత్సరంలో 146 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో అర్హత సాధించగా, 30 మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఎంపికయ్యారు.రాష్ట్రస్థాయి పోటీల్లో 26 మంది విద్యార్థులు పతకాలు సాధించగా, జాతీయస్థాయి పోటీల్లో 5 మంది విద్యార్థులు రాణించి సంస్థకు కీర్తి తీసుకొచ్చారు. విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి సారిస్తూ రోజువారీ అధ్యయన సమయాలను అమలు చేస్తున్న సంస్థ, వారి ఆరోగ్య సంరక్షణకూ ప్రాధాన్యత ఇస్తోంది. విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి, పరిశుభ్రతకు సంబంధించిన వస్తువులు, ఆరోగ్య సంరక్షణ కిట్లను ఉచితంగా అందజేస్తోంది. అదేవిధంగా పాఠశాలల్లో ఏఎన్ఎంలు, హౌస్ మాస్టర్లు, వార్డెన్ల సేవలను అందుబాటులో ఉంచి విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తోంది.గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉన్నత లక్ష్యాల సాధనకు మార్గనిర్దేశం చేస్తూ, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్న ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల విద్యాలయాల సంస్థ రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటుందని ప్రిన్సిపల్ ఎం.వి.రమణరావు తెలిపారు.

# 15న పాడేరులో ఉపాధి హామీ సదస్సు జయప్రదం చేయండి



- ఉపాధి హామీ కూలీలను ఫేషియల్ అటెండెన్స్ విధానం రద్దుచేయాలి.
- ఉపాధి హామీ పథకం పాత పద్ధతితోనే కొనసాగించాలి.
- మండల సిఐటియు కార్యదర్శి కె శంకర్ రావు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 13.**ఉపాధి హామీ పనులు పాత పద్ధతిలోని కొనసాగించాలని, అల్లూరి జిల్లా కేంద్రంలో 15న జరిగే సదస్సుకు ఉపాధి హామీ వేతనదారులు తరలి వచ్చి జయ ప్రదం చేయాలని ముంచంగిపుట్టు సిఐటియు మండల కార్యదర్శి కె శంకర్ రావు అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ.. 2005 సంవత్సరంలో యూపీఏ-1 ప్రభుత్వంలో వామపక్షాల పోరాట ఫలితంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఏర్పడిందన్నారు. ఈ చట్టం పేద ప్రజలకు ఆర్థికంగా ఎంతగానో ఉపయోగ పడుతుందనీ, అల్లూరి జిల్లాలో 1,70,547 జాబ్ కార్డులకు గాను 3,34,378 మంది ఉపాధి కార్మికులు ఈ పథకంలో నమ్ముకుని ఉపాధి పొందుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని సవరణ చేసి,విబిజిరామ్ జి పథకం పేరును మార్పులు చేసి, కొత్త విధానంతో ఉపాధి 2 పూటలు అటెండెన్స్ విధానం తీసుకొచ్చిందనీ, ముఖ హాజరు తప్పనిసరి అవ్వడం వల్ల ఉపాధి కార్మికులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో సరియైన నెట్ సౌకర్యం అందుబాటులో లేక 2 సార్లు ముఖ హాజరు కోసం ఉపాధి కార్మికులు కిలోమీటర్ల దూరంలో తీవ్రమైన ఎండలు నడిచి గంటల తరబడి నిరక్షణతో ఫేషియల్ ఫోటోకోసం వేచి ఉంటున్నారని, పనిచేసిన కార్మికులకు హాజరు పడక పోవడం వలన కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్న వైసిపి పార్టీ పార్లమెంట్లో మద్దతు ప్రకటించారనీ, రాష్ట్రంలో ప్రజలకు హాని కలిగించే విధానాలకు అమలు చేస్తుంటే నోరు మెదపకుండా వత్తాసు పలుకుతున్నారన్నారు. మన రాష్ట్రంలో అధికారిక పక్షం ప్రతిపక్షంగా ఉన్న దేశంలో మాత్రం 2 పక్షలు ఒకటేనని, ఉపాధి గతంలో కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులు కేటాయిస్తుండగా నేడు వాటిని కుదిస్తూ కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులు కేటాయిస్తున్నారన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని కేంద్రం ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించి చట్టాలని దశలవారీగా నిధులను కుదిస్తుంద కావున ఉపాధి చట్టం పాత పద్ధతితో కొనసాగించాలని ఉపాధి కార్మికులందరూ సిఐటియు సంఘం అధ్వర్యంలో ఐక్యంగా పోరాడి ఉపాధి హామీ చట్టం కాపాడుకుందాం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ మేట్లు, కూలీలు, పి ఉదయ్ కుమార్, ఎస్ రాందాస్, సదా తదితరులు పాల్గొన్నారు.

# “పచ్చని”జీవితాలకోసం భవిష్యత్తు బంతులు



- ప్రకృతిని కాపాడుకుందాం విత్తనాల బంతులు తయారు చేద్దాం
- చిరంజీవి చౌదరి, ప్రిన్సిపల్ సెక్రటరీ,ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం

**విశాఖ తూర్పు,పెన్ పవర్, జూన్ 13:**విత్తనాల బంతులతో పచ్చదనం పెంపొందించుదాం అని ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి పిలుపునిచ్చారు. శనివారం విశాఖపట్నం లోని స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో సిఇఒ పి విజయకుమార్ ఆధ్వర్యంలో, ?గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ నేతృత్వంలో విత్తనాల బంతులు తయారు చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ విత్తనాల బంతులు తయారు చేయాలి అని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విత్తనాల బంతులు తయారు చేయడం జరిగుతోందని వివరించారు.గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ నలభై ఏళ్లు విత్తనాల బంతులు విద్యార్థులతో చేయడం జరుగుతుంది అన్నారు.మనమంతా ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందదాయకం అని వివరించారు విశాఖపట్నం చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఐ కాశీ విశ్వనాథ్ రాజు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. దేశీయ విత్తన సంపత్తిని కాపాడుకోవాలి అని వివరించారు. విత్తనాల బంతులతో సామాజిక వనాలు పెంచుదాం అని కోరారు.

జివిఎంసి అడిషనల్ కమిషనర్ వర్మ మాట్లాడుతూ ప్రకృతి వనరుల పరిరక్షణ మానవాళి బాధ్యత అని పేర్కొన్నారు. జివిఎంసి చాలా కాలంగా గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ తొ కలిసి విత్తనాల బంతులు తయారు చేయడం జరిగుతోంది అని వివరించారు.

ఈ కార్యక్రమంలో వనమాలి సిటిజి అడ్మిన్ లు అరుణ, సరిత లు, ఏరియా లో అడ్మిన్ లు, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ చీఫ్ మేనేజర్ కళ్యాణి,సీనియర్ మేనేజర్ నిమ్మకాయల మూర్తి, ఏక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధి ఐ కృష్ణ కుమారి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, సమన్వయకర్తలు పి.మాలతి,పి భాస్కర్, జె రాజేశ్వరి తదితరులు విత్తనాల బంతులు తయారు చేయడం జరిగింది.

# ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ వేడుకలకు సన్నాహాలు.

- అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో కార్యచరణపై సమావేశం.
- ఎమ్మార్పీఎస్ పాడేరు నియోజకవర్గ అధ్యక్షుడు ధారబాబు.

**చింతపల్లి పెన్ పవర్ జూన్ 13.**మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పుట్టినరోజునే ఆ సంఘ ఆవిర్భావ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ వచ్చే నెల జులై 7వ తేదీన రానున్న 32వ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఉత్సాహంతో అత్యంత ఘనంగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో సన్నాహాలు ముమ్మరమయ్యాయి. ఈ కార్యక్రమాలను పండుగ వాతావరణంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టేందుకు పాడేరు నియోజకవర్గ నాయకులు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు చింతపల్లి మండల కేంద్రంలోని శనివారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్ వద్ద ఎంఆర్పీఎస్ పాడేరు నియోజకవర్గ అధ్యక్షుడు ముసురుపాము దారబాబు ఆధ్వర్యంలో కార్యాచరణ, సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. కాలనీ వాసులు, స్థానిక నాయకులతో కలిసి ఆయన వేడుకల నిర్వహణ, ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. సంస్థ వ్యవస్థాపకుడి పుట్టినరోజునే ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవడం కార్యకర్తల్లో ఎప్పుడూ నూతనోత్సాహాన్ని నింపుతుందని, ఈసారి కూడా ఈ వేడుకలను చారిత్రాత్మకంగా నిర్వహించాలని సమావేశంలో పాల్గొన్న నాయకులు, కాలనీ వాసులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఇందులో భాగంగా వేడుకల రోజున (జులై 7న) ఎంఆర్పీఎస్ జెండా ఆవిష్కరణ



కార్యక్రమాన్ని కూడా ఘనంగా నిర్వహించనున్నట్లు నాయకులు వెల్లడించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడు దారబాబు మాట్లాడుతూ.. దళితుల హక్కుల సాధన కోసం మందకృష్ణ మాదిగ దశాబ్దాలుగా చేస్తున్న రాజీలేని పోరాటాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. జులై 7న చేపట్టాల్సిన జెండా ఆవిష్కరణ, వేడుకల రూపకల్పన, జన సమీకరణ, క్షేత్రస్థాయిలో చేయాల్సిన ఏర్పాట్లపై ఆయన స్థానిక నాయకులు, యువతకు దిశానిర్దేశం చేశారు. ఈ వేడుకలను విజయవంతం చేయడానికి స్థానికులంతా పూర్తి సమన్వయంతో, బాధ్యతాయుతంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి చిందాడ అప్పారావు, ఎమ్మార్పీఎస్ చింతపల్లి మండలం అధ్యక్షులు పెదపూడి. నాగేశ్వరరావు, ఎం ఎస్ పి మండల అధ్యక్షులు సిహెచ్. అప్పారావు, స్థానిక ఎంపీటీసీ చిందాడ జయలక్ష్మి, మహిళా సమాచార అధ్యక్షులు సోమరాజు, సిహెచ్ రాజు, అపర్ణ, సాయి లక్ష్మి, డాక్టర్ అంబేద్కర్ కాలనీ వాసులు, కార్యకర్తలు, యువకులు పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
‘ ఐదు రోజులకు ’
‘4 సెం.మీ 4 సెం.మీ’
‘మరిన్ని వివరాలకు సంప్రదించండి ’
93948 55244
షరతులు వర్తిస్తాయి

# గో బ్యాక్ బీచ్ షాక్స్

**గోవా కల్చర్ వద్దు-ప్రశాంత విశాఖ కల్చరే ముద్దు**

**పేరు పర్యాటకం! యువత భవిష్యత్తు ప్రశ్నార్థకం - ఐద్వా**




**విశాఖ తూర్పు,పెన్ పవర్,జూన్ 13**: విశాఖపట్నం సముద్ర తీరంలో మద్యం విక్రయాలకు అనుమతినిచ్చే ప్రభుత్వ”బీచ్ షాక్” నిర్ణయాన్ని నిరసిస్తూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో ఆర్కబీచ్ కాళీమాత ఆలయం వద్ద శనివారం నిరసన ర్యాలీ జరిగింది.ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభావతి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాధవి,త్యవతి,జిల్లా ఉపాధ్యక్షురాలు బి,పద్మ మాట్లాడుతూ.. గోవా కల్చర్ పేరుతో బీచ్‌లలో మద్యం అమ్మకాలకు అనుమతులివ్వడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు.ప్రభుత్వం కేవలం తన ఖజానా నింపుకోవడానికి,మద్యం సిండికేట్లకు లబ్ధి చేకూర్చడానికే ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు.

కుటుంబాలు, మహిళలు, పిల్లలు ప్రశాంతత కోసం వచ్చే విశాఖ బీచ్‌లో మద్యం అందుబాటులోకి వస్తే మహిళల రక్షణ గాల్లో కలిసిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఇప్పటికే సమాజంలో మద్యం,మత్తు పదార్థాల వల్ల గృహ హింస, ఆర్థిక సంక్షోభం పెరిగి ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, పిల్లల చదువులు ఆగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.నగరంలో పెరుగుతున్న గంజాయి, డ్రగ్స్ సంస్కృతికి తోడు ఈ నిర్ణయం యువతను మరింత నిర్వీర్యం చేస్తుందని, అలాగే సముద్ర తీరం ప్లాస్టిక్ వ్యర్థాలు,మద్యం సీసాలతో నిండి పర్యావరణం పూర్తిగా ధ్వంసమవుతుందని హెచ్చరించారు.ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు మహిళలు, యువతను ఏకం చేసి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఐద్వా స్పష్టం చేసింది.

బీచ్ షాక్” నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలనీ

విశాఖ బీచ్ తో సహా రాష్ట్రం లో ఏ బీచ్ బీచ్ పరిసరాల్లో మద్యం అమ్మకాలు చేపట్టకూడదని,నగరంలో అక్రమ మద్యం అమ్మకాలను, బెల్ట్ షాపులను,గంజాయి మరియు డ్రగ్స్ రవాణాను కఠినంగా అణచివేయాలంటూ మహిళలు యువత రక్షణను మరింత పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు..

ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఆఫీస్ బేరర్స్ కొండమ్మ, వరలక్ష్మి,సుమిత్ర, రమణి, ప్రభావతి,కుమారి,రమణమ్మ,మౌనిక,అరుణ, సత్యవతి, మంగవేణి,దేవి,నారాయణ, కృష్ణ మెటర్నిటీ హాస్పిటల్ స్టాఫ్ , పెద్ద సంఖ్య లో మహిళలు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి ఆలయంలో భారీ అన్న సమారాధన



**గాజువాక: పెన్ పవర్ ,జూన్ 13** జీవీఎంసీ 65 వ వార్డు బానోజీ తోట వాంబే కాలనీ గరుడాద్రి కొండపై వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని శ్రీ వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ వారి ఆర్థిక సహాయంతో ఆలయ కమిటీ ఆధ్వర్యం లో నిర్వహించారు . ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల , ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంవహించారు . ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఉత్తర ఆంధ్రలో ఉత్తర ముఖముగా వెలసిన గరుడాద్రి వెంకటేశ్వర స్వామి ఆలయం ఇది రెండవది ఉత్తర ద్వారములో స్వయంభుగా వెలసిన ఆలయం భక్తులు కోరిన కోరికలు తీర్చే స్వామి వెంకటేశ్వర స్వామి. స్వామివారికి ఏడు వారాలు ముడుపులు కట్టి ఎనిమిదవ వారం మొక్కు తీర్చుకున్న వారికి స్వామివారి కరుణ కటాక్షాలు వారిపై ఉంటాయని భక్తులు ప్రగాఢ నమ్మకం. ఆలయ కమిటీ వారు ఆలయ సేవకులు ఆధ్యాత్మిక కాశి యాత్ర ముగించుకొని కాశీ విశ్వనాధ్ను ఆశీస్సులతో తిరిగి వచ్చి వైకుంఠ వెంకటేశ్వర స్వామి దివ్య ఆశీస్సులతో అన్న ప్రసాద వితరణలో పాల్గొన్న సేవకులు అందరూ ఆలయ చైర్మన్ దొడ్డి రమణకు, ఆలయ ధర్మకర్త మంత్రి మంజులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెంటకోట రాజు ఆలయ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అంబులెన్స్ లేక ప్రజల ఆందోళన

- సప్పర్ల ఆసుపత్రి ఎదుట ధర్నా.. వెంటనే అంబులెన్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జూన్ 13:** అల్లూరి సీతారామరాజు జిల్లా జీకేవీధి మండలం అమ్మవారి ధారకొండ, గాలికొండ గ్రామ పంచాయతీలకు సేవలు అందిస్తున్న సప్పర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో గత నెల రోజులుగా అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో శనివారం సప్పర్ల ఆసుపత్రి ఎదుట రెండు పంచాయతీల ప్రజలు ధర్నా నిర్వహించారు.అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్స్ లేకపోవడంతో చింతపల్లి ఆసుపత్రికి బస్సుల్లో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నదని గ్రామస్తులు తెలిపారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో అంబులెన్స్ సేవలు అత్యంత అవసరమని, కానీ నెల రోజులుగా సేవలు నిలిచిపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సప్పర్ల ఆసుపత్రికి ప్రత్యేక అంబులెన్స్ను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గాలికొండ మాజీ సర్పంచ్ సర్పంచ్ కాకూరి బుజ్జిబాబు, అమ్మవారి ధారకొండ, గాలికొండ పంచాయతీల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు."గిరిజన ప్రాంత ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు.. సప్పర్ల ఆసుపత్రికి వెంటనే అంబులెన్స్ కేటాయించాలి" అని ఆందోళనకారులు ప్రభుత్వాన్ని కోరారు.

# విశాఖ ఉక్కు కర్మాగారం లో మరణించిన కార్మికులకు నివాళులు



**కూర్మన్నపాలెం :పెన్ పవర్ ,జూన్ 13 :**జీవీఎంసీ 87వ వార్డు పరిధి టిడిపి కార్యాలయం లో మాజీ కార్పొరేటర్ బొండా ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు కర్మాగారంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికులకు కొవ్వొత్తిలతో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారికీ తన ప్రగడ సానుభూతి తెలిపారు. మృతులు కుటుంబానికి ఆ భగవంతుడు ఆత్మ దైర్యం ప్రసాదించాలని కోరారు . అనంతరం వై సి పి ప్రభుత్వం శవాల రాజకీయం చేతుందని ఇవన్నీ ప్రజలు గ్రహిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమం లో వార్డు అధ్యక్షుడు విజయరామరాజు, సెక్రెటరీ బొట్టా ప్రకాష్, మాజీ హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ బెల్లంకొండ రాజన్ రాజు,వార్రే రాంబాబు, డివి సూరిబాబు, చొప్ప నూకరాజు, కళ్యాణ్ చక్రవర్తి, పోతల కృష్ణ , ఆదినారాయణ, దాలయ్య, మూర్తి, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మాస శివరాత్రి పురష్కరించుకొని పూజాదికాలు



**గాజువాక :పెన్ పవర్ ,జూన్ 13** మాస శివరాత్రి పర్వదినం సందర్భంగా పెదమడక, శ్రీ ఉమామహేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు . పూజలు అనంతరం పినపాల అప్పారావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు . పూజ కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో భక్తులు , ఆలయ కమిటీ సభ్యులు గెద్దాడ అప్పలరాజు, కరణం సన్నీ, అమరపిన్ని సోమేశ్వరరావు, కొలిపాక అప్పారావు, దానబాల కృష్ణ,కాయల నరసింగరావు, గుదే అప్పలరాజు, కండిపిల్లి పైడిరాజు,బోయిన రామకోటి పాల్గొన్నారు.

# యువత చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

### మహిళల భద్రత, సైబర్ క్రైమ్, గంజాయి నివారణపై అవగాహన సదస్సు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, జూన్ 13:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం దేవరపల్లి గ్రామంలో మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, గంజాయి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీకేవీధి సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఐ సుధాకర్ మాట్లాడుతూ మహిళలపై జరిగే అన్యాయాలు, వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని కోరారు. ఇటీవల సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడించవద్దని హెచ్చరించారు. గంజాయి వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, ఆరోగ్య సమస్యలతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. యువత గంజాయి సహా ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనకుండా బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీకేవీధి ఎస్ఐ సురేష్, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆశ్రమ వసతి గృహాల్లో దోమల నివారణకు మలేరియా స్ప్రేయింగ్ .



డాక్టర్ జగదీష్ నాయక్, సందేశ్, సి హెచ్ ఓ ప్రశాంత్ కుమార్.

**కొయ్యూరు,పెన్ పవర్ జూన్ 13:** మండల పరిధిలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహాల్లో, పాఠశాలల్లో ముందస్తు జాగ్రత్త చర్యలుగా దోమల నివారణకు మలేరియా స్ప్రేయింగ్ చేపడుతున్నట్టు రాజేంద్రపాలెం పి హెచ్ సి వైద్యాధికారు లు జగదీష్ నాయక్, సందేశ్, సి హెచ్ ఓ ప్రశాంత్ కుమార్, సబ్ యూనిట్ అధికారి నూకరాజు లు తెలియజేశారు. ఈ మేరకు కొయ్యూరు బాయ్స్ -1,2 వసతి గృహాల్లోనూ , కేజీబీవీ బాలికల పాఠశాలలలో శనివారం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఈ స్ప్రెయింగ్ నిర్వహించారు. మండల కేంద్రంలో ఉన్న అన్ని ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు ముందస్తు చర్యల్లో భాగంగా నివాస ప్రదేశాల అన్ని చోట్ల ఈ దోమల నివారణకు మలేరియా స్ప్రేయింగ్ చేపడుతున్నట్టు రాజేంద్రపాలెం పి హెచ్ సి వైద్యాధికారు లు జగదీష్ నాయక్, డాక్టర్ సందేశ్,సి హెచ్ ఓ ప్రశాంత్ కుమార్ లు తెలిపారు. వారం రోజుల్లో ఆయా పాఠశాలల్లో పారిశుధ్య పనులు పూర్తి చేసి విధ్యార్థులకు అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్టు సి హెచ్ ఓ ప్రశాంత్ కుమార్, సబ్ యూనిట్ అధికారి నూకరాజు లు తెలిపారు.

# జెసి ఆదేశాలతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం...!

- ఆక్రమణకు గురైన భూమి పిర్యాదుపై కన్నవరంలో గ్రామ సభ.
- రీ సర్వే చేసి భూమిని అందజేస్తాం
- తహసిల్దార్ ప్రసాదరావు.



**కొయ్యూరు,పెన్ పవర్ జూన్ 13:** తమ భూమినీ గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించి స్వాధీన పరచుకున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ కు ఒక గిరిజనుడు చేసిన పిర్యాదు పై తహశీల్దారు ప్రసాదరావు ఆ గ్రామంలోనే గ్రామ సభ నిర్వహించారు. అందరి సమక్షంలో పిర్యాదు దారిని భూమి వివాదంపై దర్యాప్తు చేసి రీ సర్వే చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ అందించిన వివరాలిలా ఉన్నాయి. కొయ్యూరు మండలంలోని భూద రాళ్ల పంచాయితీ శివారు కన్నవరం కు చెందిన గేమ్మిలి మోహనరావు శుక్రవారం కలెక్టరేట్ లో నిర్వహించిన పీజీఆర్ ఎస్ గ్రీవెన్స్ లో జాయింట్ కలెక్టర్ కు పిర్యాదు చేశారు. ఈ పిర్యాదు పై తక్షణమే చర్యలు చేపట్టాలంటూ జాయింట్ కలెక్టర్ కొయ్యూరు తహసీల్దార్ కు ఆదేశించారు. దీంతో శనివారం కన్నవరం లో తహసీల్దార్ ప్రసాదరావు, ఆర్ ఐ రాజన్నదొర, వి ఆర్ ఓ గంగాధర్, గ్రామస్తుల సమక్షంలో ప్రజా పరిష్కార సమావేశం ఏర్పాటు చేశారు. ఈ గ్రామ సభలో మోహనరావు చేసిన పిర్యాదు పై తహశీల్దారు చేసిన విచారణ లో మోహన్రావు కు చెందిన సొంత భూమిని (85 సెంట్లు )కొందరు గ్రామానికి చెందిన వారు ఆక్రమించి స్వాధీన పర్చుకున్నట్టు తెలిపారు. ఈ విచారణ లో దర్యాప్తు చేశామని త్వరలోనే పూర్తి సర్వే చేసి పిర్యాదు దారినికి న్యాయం చేస్తామని తహసీల్దార్ ప్రసాదరావు గ్రామ పంచాయతీలోని గ్రామసభలో తెలియజేశారు. ఈ గ్రామ సభలో ఆర్ ఐ రాజన్నదొర, వి ఆర్ ఓ గంగాధర్, మరియు వి ఆర్ ఎ లు పాల్గొన్నారు.

# కొయ్యూరు ఎంపీడీవో ఆవరణలో యోగాంధ్ర శిక్షణ




**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 13:** ఈ నెల 21న జరగనున్న 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని కొయ్యూరు ఎంపీడీవో జీడివి ప్రసాదరావు ఆధ్వర్యంలో శనివారం యోగ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జిడివి ప్రసాదరావు యోగ ప్రాముఖ్యత గురించి వివరించారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతి ఒక్కరూ తన జీవితంలో యోగాకు కొంత సమయం కేటాయించి యోగా చేయాలన్నారు. ఆరోగ్యంవంతమైన సమాజ నిర్మాణానికి యోగ ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పలువురు విద్యార్థులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్ ప్లాంట్ కార్మికుడు సూరిబాబు మృతిపై పల్లా సంతాపం



**గాజువాక :పెన్ పవర్ ,జూన్ 13 :**విశాఖ స్టీల్ ప్లాంట్లో ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న కాంట్రాక్ట్ కార్మికుడు సూరిబాబు శనివారం మృతి చెందడం పట్ల గాజువాక ఎమ్మెల్యే, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సంతాపం తెలిపారు . విషయం తెలుసుకున్న పల్లా కేజీహెచ్కు చేరుకొని సూరిబాబు పార్థివదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని వారికి భరోసా కల్పించారు. పోస్ట్మార్టం సహా అధికారిక ప్రక్రియలు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులతో మాట్లాడి స్వయంగా పర్యవేక్షించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం, యాజమాన్యం తరఫున అందాల్సిన నష్టపరిహారం, ఇతర సహాయాలు తక్షణమే అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.కార్మికుల సంక్షేమం, భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని , ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా యాజమాన్యం మరింత అప్రమత్తంగా వ్యవహరించి అవసరమైన భద్రతా చర్యలను పటిష్టం చేయాలని పల్లా సూచించారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు టిడిపి సమాయత్తం



**గాజువాక :పెన్ పవర్ ,జూన్ 13** జీవీఎంసీ 66వ వార్డు బి ఎల్ ఎ తో స్పెషలు ఇంటెన్సు రివిజన్ పై అవగాహనను గాజువాక నియోజవర్గం తెలుగుదేశం పార్టీ ఆఫీసులో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు , శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వార్డు అధ్యక్ష, కార్యదర్శుల సమక్షంలో నెల రోజులు బి ఎల్ వో ల తో కలిసి డోర్ టు డోర్ వెళ్లి స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ పై తప్పుడు ఓటు నమోద డిలేషన్, 18 సంవత్సరాల దాటిన యువతకి ఓటు యాడింగ్, ఎవరైనా కాలం చేసుంటే డెత్ ఎంట్రీ, ఇంకొక ప్రాంతంలో ఓటు ఉండి 66 వార్డ్ లో ఓటు ఉంటే డిలేషన్, ప్రక్రియ ఈ నెల రోజులు జరిగే కార్యక్రమం పై అధ్యక్షుడు తో అవగాహన కార్యక్రమం నిర్వహించారు . వార్డ్ అధ్యక్షుడు , క్లస్టరు, వివిధ అనుబంధ సంఘ అధ్యక్ష కార్యదర్శులు, సీనియర్ మహిళా కార్యకర్తలు , సీనియర్ నాయకులు పాల్గొన్నారు, వార్డు బూతు ఇన్చార్జిలు, బిఎల్ఎ లు పాల్గొని అవగాహన కల్పించారు .

# గంజాయి పండించడం, రవాణా చేయటం చట్ట రీత్యా నేరం-ఎస్ ఐ సురేష్



**డుంబ్రిగూడ పెన్ పవర్ జూన్,13:**జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు మండలంలో గసభ పంచాయితీ గసభ మరియు గొందిగుడ గ్రామాలను ఎస్సై ఎల్ సురేష్ సందర్శించి గ్రామంలో ఉన్నటువంటి యువకులు, మహిళలు, పెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు అనంతరం ఎస్ ఐ సురేష్ మాట్లాడుతూ యువకులు మరియు ప్రజలు గంజాయి రవాణా వంటి నేరాలకు దూరంగా ఉండాలని, రోడ్లపైన వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా, రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ నడపి రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించవలెనని మరియు మహిళల భద్రత మనందరి బాధ్యత అని మహిళల పట్ల గౌరవంగా ఉండాలని మహిళలను, బాలికలను వేధించడం వెంబడించడం చట్టరీత్యా నేరమని, అటువంటి వ్యక్తులపైన చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పాఠశాలలు ప్రారంభమవుతున్నందువలన బడి ఈడు వయసున్న పిల్లలందరూ పాఠశాలలకు తప్పనిసరిగా వెళ్లాలని, అటువంటి పిల్లలకు ఉచితంగా నోట్ పుస్తకాలను, పెన్నులు, పెన్సిల్ పంపిణీ చేశారు. మరియు గ్రామంలో ఉన్న యువకులు కు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజన చట్టాలను, హక్కులను కాపాడుకుందాం.

**గిరిజనులందరూ ఐక్యంగా కదలిరండి.**

**1/70, పెసా చట్టాల అమలులో అధికారుల నిర్లక్ష్యంపై ఆవేదన వ్యక్తం చేసిన దండకారణ్య విమోచన సమితి రాష్ట్ర కార్యదర్శి కవడం కాసులమ్మ.**

**చింతపల్లి పెన్ పవర్ జూన్ 13.** అల్లూరి సీతారామరాజు జిల్లాలో గిరిజనుల హక్కులను పరిరక్షించే చట్టాలు క్రమంగా నిర్వీర్యమవుతున్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి గిరిజనుడిపై ఉందని దండకారణ్య విమోచన సమితి (డిఎల్ఓ) రాష్ట్ర కార్యదర్శి కవడం కాసులమ్మ ఉద్ఘాటించారు. "మేలుకో గిరిజనుడా" అంటూ ఆదివాసీలను చైతన్యపరిచిన ఆమె.. 1/70 లాంటి చారిత్రక చట్టాల ప్రాధాన్యాన్ని తెలుసుకుని, హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు. గిరిజనుల మనుగడకు, ఆత్మగౌరవానికి చట్టాలే ప్రధాన రక్షణ కవచాలని ఈ సందర్భంగా ఆమె వివరించారు. ముఖ్యంగా 1970లో అమల్లోకి వచ్చిన ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ (1/70) చట్టం ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు ఒక వరం లాంటిదన్నారు. ఈ చట్టం ప్రకారం ఏజెన్సీలో గిరిజనుల భూములను గిరిజనేతరులు కొనడం, అమ్మడం లేదా లీజుకు తీసుకోవడం పూర్తిగా చట్టవిరుద్ధమని గుర్తుచేశారు. ఒకవేళ గిరిజనుల నుంచి గిరిజనేతరులకు ఎలాంటి భూ బదలాయింపు జరిగినా అది చెల్లదని, ఆ భూములను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకుని తిరిగి గిరిజనులకే అప్పగించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దళారులు, వలసదారుల మోసాల నుంచి అడవి బిడ్డల భూములను రక్షించడానికే ప్రభుత్వాలు ఈ చట్టాన్ని తీసుకువచ్చాయన్నారు. అయితే, ఎంతో గొప్ప ఉద్దేశంతో తెచ్చిన ఈ చట్టాలు నేడు కేవలం కాగితాలకే పరిమితం కావడం పట్ల ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో బినామీ పేర్లు, తప్పుడు పత్రాలతో గిరిజనేతరులు వేలాది ఎకరాలను యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నప్పటికీ సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పెసా, అటవీ హక్కుల చట్టాలు సైతం ఏజెన్సీలో సక్రమంగా అమలు కావడం లేదని, రాజ్యాంగం కల్పించిన గ్రామసభల ఉనికి, వాటి విలువ ప్రశ్నార్థకంగా మారిపోయాయని విమర్శించారు.



చట్టాల ఉల్లంఘనపై ఇలాగే మౌనంగా ఉంటే భవిష్యత్తులో గిరిజనులకు భూములతో పాటు హక్కులు కూడా మిగలవని కాసులమ్మ హెచ్చరించారు. ప్రతి గిరిజన యువకుడు 1/70, పేసా, అటవీ హక్కుల చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని, తమ భూమి ఎక్కడైనా ఆక్రమణకు గురైతే వెనుకాడకుండా న్యాయపోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గిరిజనుల పక్షాన దండకారణ్య విమోచన సమితి నిరంతరం అండగా నిలబడుతుందని, వారి హక్కుల కోసం ఎల్లప్పుడూ పోరాడుతూనే ఉంటుందని భరోసా ఇచ్చారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## గోదావరి నదిలో పర్యాటక బోట్ల సేవలు తాత్కాలికంగా నిలిపివేత

**భద్రతా ప్రమాణాల పరిశీలన అనంతరమే అనుమతులు: ఆర్డీవో కె. స్వాతి**



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 12:** గోదావరి నదిలో నిర్వహిస్తున్న పర్యాటక బోట్ల నిర్వహణ తీరుపై పలు ఆరోపణలు, భద్రతాపరమైన ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యగా పర్యాటక బోట్ల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు రంపచోడవరం రెవెన్యూ డివిజనల్ అధికారి కె . స్వాతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదేశాల మేరకు గోదావరి నదిలో నడుస్తున్న అన్ని పర్యాటక బోట్లపై ప్రత్యేక తనిఖీలు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. బోట్ల ఫిట్‌నెస్, సాంకేతిక పరిస్థితి, ప్రయాణికుల సామర్థ్యం, భద్రతా ప్రమాణాలు, లైఫ్ జాకెట్లు, అత్యవసర రక్షణ పరికరాలు, బోట్ యాజమాన్యాలు పర్యాటకుల భద్రత కోసం తీసుకున్న చర్యలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. రెవెన్యూ, పోలీసు, పర్యాటక, మత్స్యశాఖ, విపత్తు నిర్వహణ, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో కూడిన సంయుక్త బృందం తనిఖీలు నిర్వహిస్తుందని తెలిపారు. బృందం నివేదిక ఆధారంగా అన్ని భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నట్లు నిర్ధారణ అయిన అనంతరమే సంబంధిత బోట్లకు అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఈ నిర్ణయం తీసుకున్నామని, తనిఖీలు పూర్తయ్యే వరకు గోదావరి నదిలో పర్యాటక బోట్లను నడపరాదని బోట్ యాజమాన్యాలను ఆర్డీవో స్వాతి హెచ్చరించారు. భద్రతా నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.

## మహిళల భద్రత, రహదారి నిబంధనలు, గంజాయి నివారణపై అవగాహన ర్యాలీ



**గంగవరం /దేవీపట్నం, పెన్ పవర్, జూన్ 13:** మహిళల భద్రత, రహదారి భద్రతా నియమాలు మరియు గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో చైతన్యం కల్పించే ఉద్దేశంతో ఇందుకూరుపేట గ్రామంలో శనివారం విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దేవీపట్నం ఎస్సై షరీఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలపై జరుగుతున్న నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో పోలీసు శాఖను ఎలా సంప్రదించాలి, మహిళల భద్రత కోసం అందుబాటులో ఉన్న సేవల గురించి ప్రజలకు వివరించారు. మహిళలు నిర్భయంగా ముందుకు వచ్చి తమ సమస్యలను పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణలో ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలు నడిపేటప్పుడు వేగ నియంత్రణ పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత ఆరోగ్యం, భవిష్యత్తు, కుటుంబాలు మరియు సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు పడతాయని తెలిపారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటమే కాకుండా వాటి అక్రమ రవాణా లేదా విక్రయాల గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రజలకు సందేశాలు అందించారు. గ్రామస్తులు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని మహిళల భద్రత, ట్రాఫిక్ అవగాహన, మాదకద్రవ్యాల నివారణపై పోలీసు శాఖ చేపడుతున్న చర్యలను అభినందించారు.

## మహిళల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన ర్యాలీ

**ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి.. గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి**






**గంగవరం, పెన్ పవర్, జూన్ 13:** పోలవరం జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ ఆదేశాల మేరకు, రంపచోడవరం ఎస్‌డీపీవో పి. అష్రాఫ్ అలీ పర్యవేక్షణలో అడ్డతీగల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర కుమార్ ఆధ్వర్యంలో మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ గజేంద్ర కుమార్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా మహిళల భద్రత, మహిళా హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి వేధింపులు ఎదురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన, మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. యువతలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతుండటం ఆందోళనకరమని పేర్కొన్న సీఐ, తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. గంజాయి రవాణా, వినియోగం వంటి చర్యలను నేరంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ వెంకయ్య మాట్లాడుతూ సమాజంలో మహిళల పట్ల గౌరవప్రదమైన ప్రవర్తన కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించి బాధ్యతాయుత పౌరులుగా వ్యవహరించాలని సూచించారు. పాత గంగవరం అంబేద్కర్ సెంటర్ నుంచి వారపు సంత వరకు నిర్వహించిన ఈ అవగాహన ర్యాలీలో గంగవరం ఏఎస్ఐ సూర్యనారాయణ, హెడ్ కానిస్టేబుళ్లు కే. రాంబాబు, జగదీష్, కొండబాబు తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను ఏమైనా అంటే ఊరుకోం




- **జనసేన ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్**

**జగ్గంపేట పెన్ పవర్ జూన్ 13 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని ఏమైనా అంటే ఊరుకునే ప్రసక్తి లేదని, ప్రజలు ఎదురు తిరుగుతారని జగంపేట జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ అన్నారు. శనివారం జగ్గంపేట కాపు కళ్యాణ మండపంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సీఎం చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో సూపర్ సిక్స్ అన్ని హామీలు నెరవేరుస్తుందన్నారు. మిగిలిన పథకాలు కూడా అమలు త్వరలో ప్రారంభిస్తామన్నారు. వైసిపి కుట్ర పూరిత ఆరోపణలు చేస్తుందని ఎద్దేవా చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని విమర్శించడం తోట నరసింహంకు తగదని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని తుమ్మలపల్లి రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేటి నుంచి ప్రతిష్టాత్మకంగా ఓటర్ల జాబితా సమగ్ర సర్వే

- **బీఎల్‌వోలకు ఓటర్లు సహకరించాలి**
- **ఏఈఆర్వో మర్రాపు సన్యాసిరావు**

**పెన్ పవర్ ఉంగుటూరు, జూన్ 13:** ఉంగుటూరు నియోజకవర్గంలో ఓటర్ల జాబితా



సమగ్ర సర్వే సందర్భంగా 2002 ఓటర్ల జాబితాతో 2025 ఓటర్ల జాబితాను అనుసంధానించే ప్రక్రియపై నియోజకవర్గ సహాయ ఓటరు నమోదు అధికారి, ఉంగుటూరు తహశీల్దారు మర్రాపు సన్యాసిరావు మాట్లాడుతూ సర్వే ప్రాధాన్యతను వివరించారు.

ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటర్ల మ్యాపింగ్ కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకమైందని తెలిపారు. 2002లో ప్రతి ఇంటికీ వెళ్లి బూత్ స్థాయి అధికారులు ఓటర్ల జాబితా సమగ్ర సర్వే నిర్వహించారని, మళ్లీ 24 సంవత్సరాల అనంతరం చేపడుతున్న ఈ కార్యక్రమానికి విశేష ప్రాధాన్యత ఉందన్నారు.

ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలోని 214 పోలింగ్ కేంద్రాలకు చెందిన 2,07,346 మంది ఓటర్ల వివరాలను మరింత పారదర్శకంగా, శాస్త్రీయంగా రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. 2025 ఓటర్ల జాబితాలో ఉన్న వివరాలను 2002 మాస్టర్ డేటాతో అనుసంధానం చేయడం ద్వారా ఓటర్ల వివరాల్లో గందరగోళం, నకిలీ ఓట్లు, పునరావృత నమోదులు వంటి సమస్యలను నివారించవచ్చని తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఖచ్చితంగా అందేలా చేయడంతో పాటు, ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో ప్రామాణికంగా రూపొందించేందుకు ఈ సర్వే దోహదపడుతుందని చెప్పారు. ఈ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరిస్తారని, ప్రజలు వారికి పూర్తి సహకారం అందించాలని ఏఈఆర్వో మర్రాపు సన్యాసిరావు కోరారు.


## ప్రమాదకర పనుల్లో మహిళల నియామకం చట్టవిరుద్ధం.

- **పిఠాపురం 12వ అదనపు జిల్లా కోర్టు ప్యానల్ న్యాయవాదులు స్పష్టం**

**కాకినాడ బ్యూరో ( గొల్లప్రోలు) పెన్ పవర్, జూన్ ,13**

మహిళలను ప్రమాదకరమైన పనుల్లో నియమించడం చట్టరీత్యా నేరమని, యజమానులు దీనిని కఠినంగా పాటించాలని పిఠాపురం 12వ అదనపు జిల్లా కోర్టు ప్యానల్ న్యాయవాదులు స్పష్టం చేశారు. శనివారం పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం చెబ్రోలు ప్రాంతంలోని ఫ్యాక్టరీలో పనిచేస్తున్న మహిళా కార్మికుల కోసం లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఒక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యానల్ న్యాయవాది నూకరాజు మాట్లాడుతూ... మహిళా కార్మికుల భద్రత,వారి హక్కుల గురించి వివరించారు. ప్రమాదకరమైన పనుల్లో మహిళలను వినియోగించడం చట్టవిరుద్ధమని,వారి ఆరోగ్యానికి,రక్షణకు భంగం కలిగించే పనులకు వారిని కేటాయించకూడదని ఆయన హెచ్చరించారు. మహిళా కార్మికులు తమకు ఉన్న ప్రాథమిక హక్కులు, పని ప్రదేశంలో ఉండాల్సిన భద్రతా ప్రమాణాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, సమాజంలో ఈ దురాచారాన్ని అరికట్టేందుకు సహకరించాలని ఆయన కోరారు. ?పని ప్రదేశంలో మహిళల భద్రతను కాపాడటం యజమానుల ప్రాథమిక బాధ్యతని, నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని న్యాయవాదులు హెచ్చరించారు.

### విజయవంతంగా ముగిసిన ఫాకల్టీ డెవలెప్మెంట్ ప్రోగ్రాం



**గండేపల్లి,పెన్ పవర్,జూన్,13:**గండేపల్లి మండలం సూరంపాలెం: ఆదిత్య యూనివర్సిటీ ఇఇఇ విభాగం ఆధ్వర్యంలో "పైథాన్ ప్రోగ్రామింగ్ ఉపయోగించి డేటా విశ్లేషణ" అనే అంశం పై నిర్వహించిన వారంరోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఘనంగా ముగిసిందని డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా.మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. అధ్యాపకుల బోధనా నైపుణ్యాలు, పరిశోధనా సామర్థ్యాలు మరియు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు డా. ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు..ముగింపు కార్యక్రమంలో విభాగాధిపతి డా. వి. శ్రీనివాస రావు మాట్లాడుతూ అధ్యాపకులు నిరంతరం నూతన సాంకేతిక పరిజ్ఞానాలను అవగాహన చేసుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.బి. శ్రీనివాస్, రిజిస్టర్ డాక్టర్ జి. సురేష్, ప్రో వైస్ ఛాన్సలర్. డాక్టర్ ఎస్. రమాశ్రీ, ప్రో వైస్ ఛాన్సలర్.డాక్టర్ ఎ. రమేష్ తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన నిపుణులు పాల్గొని అధ్యాపకులకు శిక్షణ అందించారు. వారం రోజుల పాటు జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో వివిధ అంశాలపై సిద్ధాంతపరమైన మరియు ప్రాయోగిక శిక్షణ అందించారు. కె.ఎస్.ఎస్. ప్రవీణ్ కుమార్, జి.వి. రామ్ మోహన్, చి. మణికంఠ కళ్యాణ్, ఎం. ప్రవల్లిక రిసోర్స్ పర్సన్ గా వ్యవహరించగా అధ్యాపకులు ఉత్సాహంగా ఉన్నారు. పాల్గొన్న అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందజేసి కార్యక్రమం విజ్ఞానదాయకంగా విజయవంతంగా ముగించారు.

## మానవత్వం చాటుకున్న తలపంటి బుజ్జి....




**శంఖవరం పెన్ పవర్ జూన్ 13:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం తన స్వగ్రామం నెల్లిపూడి గ్రామంలో తన అనుకున్న వారు ఆపదలో ఉన్నారు అని తెలిస్తే నిస్వార్థంగా సాయం చేయాలనే సంకల్పంతో ముందుకెళుచున్నారు శంఖవరం మండలం జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తలపంటి బుజ్జి. నెల్లిపూడి గ్రామానికి చెందిన గంపల వెంకటేష్ ఇటీవల మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న తలపంటి బుజ్జి శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం 5. 3000 రూపాయలు 50 కేజీలు బియ్యం అందించి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా తలపంటి బుజ్జి మాట్లాడుతూ నెల్లిపూడి గ్రామంలో నిరుపేదలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలబడతానని, వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుని తన వంతు సాయం అందిస్తానని అన్నారు. గత కొన్ని నెలలుగా నెల్లిపూడి గ్రామంలో తలపంటి బుజ్జి చేస్తున్న సేవా కార్యక్రమాలపై గ్రామస్తులు, పార్టీ శ్రేణులు నుంచి అభినందనలు అందుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో తలపంటి బలరాముడు, నొక్కి వీరబాబు, కోరాడ జాను, శివకోటి ప్రసాద్, కానేటి అభి, సిట్టుమూరి కామరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శనివారం శ్రీ సత్యదేవుని ప్రాకార సేవ





**అన్నవరం పెన్ పవర్ జూన్ 13**:కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధానం లో శనివారం కావడంతోఘనంగా ప్రాకార సేవ నిర్వహించారు. ముందుగా అర్చకులు సత్యదేవుడు అనంతలక్ష్మి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి తిరుచ్చి వాహనంపై గావించి వేద పండితుల మంత్రోచ్ఛరణ భక్తుల నామస్మరణతో మంగళ వాయిద్యాల నడుమ ఆలయం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. ఈ ప్రాకార సేవా కార్యక్రమంలొ ఆలయ అర్చకులు మరియు దేవస్థానం సిబ్బంది, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అధిక జ్యేష్ఠ మాస శని త్రయోదశి వేడుకలు ఘనంగా





- మందపల్లి శనేశ్వర స్వామిని దర్శించుకున్న 40 వేలకుపైగా భక్తులు
- రూ.31.58 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో సురేష్‌బాబు వెల్లడి

**కొత్తపేట, పెన్ పవర్, జూన్ 13:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలో వెలసిన శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి దేవస్థానంలో అధిక జ్యేష్ఠ మాసంలో వచ్చిన పవిత్ర శని త్రయోదశి పర్వదిన వేడుకలు శనివారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగానిర్వహించబడ్డాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు.

ఆలయ వర్గాల సమాచారం ప్రకారం, శని త్రయోదశి పర్వదినాన సుమారు 40 వేలకుపైగా మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది.


శని త్రయోదశి సందర్భంగా ఆలయ అధికారులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, మహిళల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. భక్తులకు నిరంతరం తాగునీరు అందుబాటులో ఉంచడంతో పాటు పాలు, మజ్జిగ పంపిణీ చేశారు. ఆలయ పరిసరాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కల్పించారు. ఉచిత ఆటో సర్వీస్,వైద్య శిబిరాలు, పారిశుద్ధ్య చర్యలు, క్యూలైన్ నిర్వహణను కూడా సమర్థవంతంగా చేపట్టారు.ఈ సందర్భంగా ముఖమండప తైలాభిషేకాల ద్వారా రూ.12,24,300, శని త్రయోదశి తైలాభిషేకాల ద్వారా రూ.6,06,750, తైలం సమర్పించి దర్శనం ద్వారా రూ.1,21,200, ఫోన్‌పే చెల్లింపుల ద్వారా రూ.2,95,880 ఆదాయం లభించిందని తెలిపారు. మొత్తం ప్రత్యక్ష పూజల ద్వారా రూ.22,48,130 ఆదాయం సమకూరిందన్నారు.


అదేవిధంగా పరోక్ష పూజల ద్వారా రూ.8,63,800, అన్నప్రసాద విరాళాల రూపంలో రూ.46,646 లభించగా, శని త్రయోదశి పర్వదినాన ఆలయానికి మొత్తం రూ.31,58,576 ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషనర్,కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్‌బాబు వెల్లడించారు.అధిక జ్యేష్ఠ మాస శని త్రయోదశి ఉత్సవాలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన పోలీసు, రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ సిబ్బంది, సేవాదారులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సహకారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ఉత్సవాలు విజయవంతంగా పూర్తయ్యాయని పేర్కొన్నారు.కాగా, భారీ భక్తజన సందోహం మధ్య కూడా దర్శనాలు, తైలాభిషేకాలు, ప్రసాదాల పంపిణీ, తాగునీరు, పాలు, మజ్జిగ, చలివేంద్రాలు తదితర ఏర్పాట్లను అత్యంత సమర్థవంతంగా నిర్వహించిన సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్‌బాబును భక్తులు ప్రత్యేకంగా ప్రశంసించారు. స్వామివారి పర్వదినాన్ని ఆదర్శవంతంగా నిర్వహించిన ఆలయ అధికార యంత్రాంగానికి భక్తులు అభినందనలు తెలిపారు.



## ట్రిపుల్ ఐటీలో సత్తా చాటిన ఉన్నత పాఠశాల విద్యార్థులు








**కాజులూరు, పెన్‌పవర్ జూన్ 13:**
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కాజులూరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు మరోసారి మంచి పేరు తీసుకొచ్చారు.పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు మార్ని విష్ణుమూర్తి తెలిపారు.ఎంపికైన విద్యార్థుల్లో గీసాల తేజ శ్రీ రమ్య నూజివీడు ట్రిపుల్ ఐటీకి,బొల్లం సాయి వంశీ మరియు యాళ్ల లీలా హారిక శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. మరో నలుగురు విద్యార్థులు రెండో, మూడో విడత కౌన్సెలింగ్‌లలో ఎంపికయ్యే అవకాశాలు ఉన్నాయని ఆయన వెల్లడించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థులు ఇదే స్ఫూర్తితో విద్యలో మరింత ప్రతిభ కనబర్చి అధిక సంఖ్యలో ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించాలని ఆకాంక్షించారు.ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ చింతా నారాయణమూర్తి,పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పెంటపాటి పద్దరాజు,విద్యాదాత అన్యం శ్రీరామచంద్రమూర్తి, స్టాఫ్ సెక్రటరీ హరినాథ్,సీనియర్ ఉపాధ్యాయులు భాస్కర సత్యప్రసాద్,లక్ష్మీ కామేశ్వరి,వల్లీ భాషా,రాజరాజేశ్వరి తదితర ఉపాధ్యాయులు అభినందించి, వారి భవిష్యత్తు విజయవంతంగా ఉండాలని ఆకాంక్షించారు.

## రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి అండగా రూ. 20 వేలు అర్ధిక సహాయం అందించిన మురళీకృష్ణ.




**ఆలమూరు, పెన్ పవర్ జూన్ 13;**రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జనసైనికుడు వల్లేపు పోతురాజు కుటుంబానికి ఆలమూరు గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, ధవళేశ్వరం మురళీకృష్ణ సినిమాస్ అధినేత వంటిపల్లి మురళీకృష్ణ మానవత్వాన్ని చాటుకున్నారు. బాధిత కుటుంబం కష్టాల్లో ఉందని తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించి రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆలమూరు గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీ వంటిపల్లి పాపారావు తనయుడైన వంటిపల్లి మురళీకృష్ణ, క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న ఆ కుటుంబానికి అండగా నిలవడం పట్ల స్థానికులు, జనసేన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న సమయంలో అందించిన ఈ సహాయం బాధిత కుటుంబానికి కొంత ఊరటనిచ్చిందన్నారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ సమాజం పట్ల బాధ్యతతో స్పందించి సహాయం అందించిన వంటిపల్లి మురళీకృష్ణను అభినందించారు. ఆపదలో ఉన్న వారికి చేయూతనందించడం గొప్ప విషయమని, ఆయన సేవా భావం మరెందరికో ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి క్లిష్ట సమయంలో ముందుకు వచ్చి సహాయం అందించిన వంటిపల్లి మురళీకృష్ణకు బాధిత కుటుంబ సభ్యులు, జనసేన కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

# ట్రిపుల్ ఐటికి కిర్లంపూడి మండలం నుండి 4గురు విద్యార్థులు ఎంపిక.





**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్, 13:** కిర్లంపూడి మండలం నుండి ట్రిపుల్ ఐటికి కిర్లంపూడి మండలం నుండి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారులు, మకటి జోసెఫ్, మక్కా చిన్నారావులు తెలిపారు,కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి పంతం చిట్టిబాబు మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2026 సంవత్సరంలో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన భూపాలపట్నం గ్రామానికి చెందిన బారుకుల జాస్మి, ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి గ్రామానికి చెందిన భీశెట్టి అనిత ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారు. బారుకుల జాస్మి పదవ తరగతి పరీక్షల్లో 587 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం,బీసెట్టి అనిత 578 మార్కులు సాధించి మండలంలో ద్వితీయ స్థానం సాధించారు. దీంతో జాస్మికి నూజివీడు ట్రిపుల్ ఐటీ లోను, అనితకు ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ లోను ఎంపికయ్యారు. మండల కేంద్రమైన కొక్కొండ రామ శేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని బొడ్డేటి వీక్షిత, శ్రీకాకుళం, సోమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని జ్యోతుల హర్షిత శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ కి ఎంపికయ్యారు. ట్రిపుల్ ఐటికి ఎంపికైన విద్యార్థులు బారుకుల జాస్మి,భీశెట్టి అనిత, బొడ్డేటి వీక్షిత, జ్యోతుల హర్షిత లను మండల విద్యాశాఖ అధికారులు,టి జోసెఫ్,మక్కా చిన్నారావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎన్ మురళీ శ్రీనివాసరావు,పి రమణి కుమారి,మల్లేశ్వరరావు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.





